క్లుప్తంగా

వంగపండుకు ఘన నివాళి



వంగపండు విగ్రహానికి నివాళులర్పిస్తున్న లగుడు గోవిందరావు, తదితరులు

బీచ్ రోడ్డు: జానపద వాగ్గేయకారుడు వంగపండు ప్రసాదరావు వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆర్కే బీచ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర గద్దర్‌గా వంగ పండు పేరు తెచ్చుకున్నారన్నారు. మూడు దశాబ్దాల పాటు 300కు పైగా జానపద పాటలు రచించిన వంగపండు.. పేదలు, గిరిజనులను ఎంతో చైతన్యపరిచారన్నారు. 'ఏం పిల్లడో ఎల్దమొస్తవ'పాటతో ప్రజల మనసు దోచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, కార్యదర్శి పెదిరెడ్ల శ్రీనివాస్, రెడ్డి ఈశ్వరరావు, వరుదు రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్లు

బీచ్ రోడ్డు: గుండె జబ్బులతో బాధపడుతున్న చిన్నారులకు సోమవారం నుంచి బుధవారం వరకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయనున్నట్టు ఆంధ్ర ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పి.వి.రామారావు తెలిపారు. క్యాంపు వివరాలను ఆదివారం మీడియాకు ఆయన వివరించారు. విశాఖపట్నంలోని ఆంధ్ర ఆస్పత్రి ఆధ్వర్యంలో హీలింగ్ లిటిల్ హార్ట్స్, యూకే చారిటీతో కలిసి ఈ క్యాంపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు సాగే ఈ క్యాంపులో ఆంధ్ర హాస్పిటల్స్ కార్డియాలజిస్టులతో పాటు ఇంగ్లాండ్ నుంచి ప్రత్యేకంగా డాక్టర్స్ టీం పాల్గొంటుందన్నారు. వివరాల కోసం 88866 79733, 0891-2724777 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

అ'పూర్వ' కలయిక



మాస్టర్ హోబాయ్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

బీచ్ రోడ్డు: స్నేహితులు దినోత్సవం సందర్భంగా ఏయూ స్కూల్ 1998 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. అందరూ ఎంతో సరదాగా గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పదో తరగతి పూర్తి చేసుకుని 25 ఏళ్లు పూర్తి కావడంతో సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అప్పట్లో బోధించిన హోబాయ్ మాస్టర్‌ను సత్కరించారు.

కుటుంబ సభ్యుల చెంతకు తప్పిపోయిన వృద్ధురాలు



గౌరినాయుడుకు పైడమ్మను అప్పగిస్తున్న షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి

అల్లిపురం : కుమార్తెతో కలిసి విజయనగరం వెళ్లేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చిన వృద్ధురాలు తప్పిపోయింది. శనివారం రాత్రి ఆమెను గుర్తించిన టూటౌన్ పోలీసులు ఏయూటీడీ సిబ్బందికి అప్పగించారు. ఆమె మూగ, చెముడు కావటంతో ఏయూటీడీ సిబ్బంది ఆమె వద్ద గల పెన్షన్ స్లిప్ ఆధారంగా మద్దిలపాలెం పరిసర ప్రాంతాల్లో గల సచివాలయాలకు ఆమె వివరాలను పంపించి చిరునామా తెలుసుకున్నారు. ఆమె పేరు పైడమ్మగా గుర్తించి ఆమె కుమార్తె ఫోన్ నంబర్‌ను కనుక్కున్నారు. దీంతో మద్దిలపాలెంలో ఉంటున్న ఆమె మనవడు గౌరినాయుడుని పిలిపించి అప్పగించారు. పైడమ్మ మనవడు తమ అమ్మమ్మను రక్షించి, ఆశ్రయం కల్పించిన ఏయూటీడీ మహిళా షెల్టర్ నిర్వాహకురాలు జ్యోతిర్మయికి, సిబ్బందికి, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు



పాఠశాలలో హోరాహోరీగా జరుగుతున్న క్రికెట్ పోటీ

విద్యార్థుల క్రీడోత్సాహం

- జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేడీపీఎంలో పోటీలు
- తరగతుల అనంతరం ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు
- 29న విజేతలకు బహుమతుల ప్రదానం



ఈస్ట్ పాయింట్ కాలనీ కేడీపీఎం స్కూల్ పీటీ రత్నంతో క్రికెట్ టీమ్స్ సభ్యులు

ఎంవీపీ కాలనీ: ఈస్ట్ పాయింట్ కాలనీ కేడీపీఎం పాఠశాలలో క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. తరగతులు ముగిసిన అనంతరం విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేందుకు పోటీ పడుతున్నారు. ఈ స్కూల్‌లో 800 మందికి పైగా విద్యార్థులు ఉండగా.. ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరుగా పోటీలు జరుగుతున్నాయి. పాఠశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ రత్నం పర్యవేక్షణలో విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా ఆయా క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి.

10 ఏళ్లుగా.. నిర్విరామంగా..

పాఠశాల ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని 10 ఏళ్లుగా నిర్విరామంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. నగరంలోని అత్యధిక మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్న పాఠశాలల్లో కేడీపీఎం స్కూల్ ఒకటి. దీంతో విద్యార్థుల నుంచి ఈ పోటీలకు విశేష ఆదరణ లభిస్తోంది. స్కూల్ హెచ్ఎం సుమతిబాయితో పాటు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ పోటీలకు సహకారం అందిస్తున్నారు. వారే ప్రతి రోజు టాస్ వేసి ఈ పోటీలను ప్రారంభిస్తున్నారు. విద్యార్థులకు క్రికెట్(జూనియర్, సీనియర్), వాలీబాల్, రన్నింగ్, షటిల్ తదితర పోటీలు, విద్యార్థినుల కోసం త్రోబాల్, కబడ్డీ, ఖోఖో, రన్నింగ్ వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. గత నెల 11న ప్రారంభమైన ఈ పోటీలు ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ నెల 29న మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినం సందర్భంగా దేశ వ్యాప్తంగా నిర్వహించుకునే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా బహుమతుల ప్రదానోత్సవం జరగనుంది.

స్వచ్ఛంద సంస్థల సహకారంతో..



కేడీపీఎం స్కూల్ యాజమాన్యం పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏటా ఈ పోటీలను నిర్వహిస్తుంది. పోటీలకు అవసరమైన ఖర్చులతో పాటు బహుమతులను స్వచ్ఛంద సంస్థలు సమకూర్చుతున్నాయి. ఈ ఏడాది రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో సహకారం అందిస్తోంది. ఆయా పోటీల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లతో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మొత్తం 110 బహుమతులను ఆ సంస్థ అందజేయనుంది. 29న ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థల సమక్షంలో ఈ వేడుక ఘనంగా నిర్వహించనున్నాం. – రత్నం, టీచర్ ఆఫ్ ఫిజికల్ ట్రైనింగ్

పరిశుభ్రంగా మూడో పట్టణ పోలీస్ స్టేషన్





సాక్షి ఎఫెక్ట్..

చెత్త తొలగింపుతో పరిశుభ్రంగా దర్శనమిస్తున్న పోలీస్ స్టేషన్ పరిసరాలు

బీచ్ రోడ్డు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు. 'అధ్వానంగా త్రీటౌన్ పోలీస్ స్టేషన్'అనే శీర్షికతో పోలీసు స్టేషన్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తపై ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. స్టేషన్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేశారు. దీంతో పోలీసు స్టేషన్ ఇప్పుడు ఎంతో శుభ్రంగా అందంగా కనిపిస్తోంది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: విమ్స్‌కు సంబంధించిన 11 కేవీ ఇందిరానగర్ ఫీడర్ పరిధిలో సోమవారం విద్యుత్ నిర్వహణ పనులు జరగనున్నాయి. ఈ మేరకు ఆయా ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్, రవీంద్రనగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

గీతం ఆస్పత్రి వద్ద మృతుని బంధువుల ఆందోళన

- వైద్యుల నిర్లక్ష్యంతోనే భర్త చనిపోయాడని మహిళ ఆరోపణ



ఆందోళన చేస్తున్న సురేష్ భార్య ఝాన్సీ, కుటుంబ సభ్యులు

కొమ్మాది : వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త చనిపోయాడంటూ ఓ మహిళ గీతం ఆస్పత్రిలో ఆందోళనకు దిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మధురవాడ స్వతంత్రనగర్‌కు చెందిన పంతం సురేష్ (37) శనివారం ఉదయం ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతుండగా ఆయన భార్య ఝాన్సీ చికిత్స నిమిత్తం రుషికొండలో గల గీతం ఆస్పత్రిలో చేర్పించారు. ఆదివారం ఉదయం వరకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. రక్తం తక్కువగా ఉందని ఎక్కించారని, పరిస్థితి విషమంగా ఉందని ఆరోగ్య శ్రీకి దరఖాస్తు చేసుకోమని వైద్యులు సూచించినట్లు ఆమె తెలిపారు. అయితే అన్నీ అయిన తర్వాత ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు సురేష్ చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా జూనియర్ వైద్యులతో వైద్యం అందించారని, కనీసం రక్తం ఎక్కించడం కూడా చేతకాని జూనియర్ వైద్యులతో చికిత్స చేయించడం వల్లే తన భర్త చనిపోయాడంటూ ఝాన్సీ ఆరోపిస్తున్నారు. ఆమెతోపాటు కుటుంబ సభ్యులు ఆస్పత్రి ప్రాంగణంలో ఆందోళనకు దిగారు. ముమ్మాటికీ వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త చనిపోయాడని, ఇప్పుడు మృతదేహాన్ని ఇవ్వమంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆమె ఆరోపించారు. రెండు రోజులపాటు వైద్యం చేస్తున్నట్లు ఇక్కడి డాక్టర్లు హడావిడి చేశారని, ఉదయం నుంచి కోలుకుంటున్న వ్యక్తి సాయంత్రమయ్యేసరికి ఎలా చనిపోతాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి మృతదేహాన్ని తీసుకెళ్లమని ఆదోళన చేశారు. విషయం తెలుసుకున్న పీఎం పాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

అద్భుతం సత్యహరిశ్చంద్ర నాటకం



సత్యహరిశ్చంద్ర నాటకంలో ఓ సన్నివేశం



రామాంజనేయ యుద్ధం నాటకంలో ఓ సన్నివేశం

- అలరించిన 'రామాంజనేయ యుద్ధం'

మద్దిలపాలెం: కళాకారులను ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టకపోవడం విచారకరమని నంది అవార్డు గ్రహీత, విశాఖ ఉషారాణి కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు వంకాయల మారుతీ ప్రసాద్ అన్నారు. అసోసియేషన్ 20వ నెల కార్యక్రమాన్ని మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. సత్యహరిశ్చంద్ర నాటకాన్ని కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. రామాంజయనేయ యుద్ధం అలరించింది. శ్రీరాముడిగా కందుల గున్నేశ్వరరావు, ఆంజనేయుడిగా ఏలూరు పైడిరాజు, హరిశ్చంద్రుడుగా టి.నర్సినాయుడు, నక్షత్రగా టి.శ్రీనివాసరావు, వీరబాహుడుగా వంకాయల మారుతీ ప్రసాద్ తమ నటనతో అందర్నీ మైమరపించారు. ఈ సందర్భంగా కళాపోషకుడు శేషయ్య, డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ జగన్‌మోహనరావును ఘనంగా సత్కరించారు. అనంతరం మారుతీ ప్రసాద్ మాట్లాడుతూ కళాకారులు జీవన పరిస్థితులు దయనీయంగా ఉన్నాయన్నారు. కళాకారుల పెన్షన్ రూ.3 వేలు నుంచి రూ.5వేలుకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు ప్రసన్నకుమార్, వి.వి.రమణమూర్తి, విజయనిర్మాణ్ అధినేత సూరపనేని విజయకుమార్, పైడా కృష్ణప్రసాద్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, శ్రీమాత కళాపీఠం అధ్యక్షుడు పల్లి నాగభూషణరావు, జీవీఎంసీ గ్రేడ్-1 అధికారి పల్లి నల్లనయ్య, దండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్కే బీచ్‌లో నేవీ మారథాన్ ప్రోమో రన్




ప్రోమో రన్‌లో పాల్గొన్న యువతీ యువకులు

బీచ్ రోడ్డు: ఈ ఏడాది డిసెంబరు 15న నిర్వహించనున్న నేవీ మారథాన్‌లో భాగంగా ఆదివారం ప్రోమో రన్ ఉత్సాహంగా సాగింది. ఆర్కే బీచ్ నుంచి ప్రారంభమైన ఈ రన్‌లో యువతీ యువకులు సుమారు 700 మంది పాల్గొని సందడి చేశారు. మారథాన్ ప్రాధాన్యతను వివరించారు.

'ఉక్కు'ను విక్రయిస్తే ప్రతిఘటన తప్పదు

అగనంపూడి : తెలుగు రాష్ట్రాల ప్రజల ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్న విశాఖ ఉక్కును విక్రయించాలని చూస్తే పెద్ద ఎత్తున ప్రతిఘటన తప్పదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల సారథ్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్ శక్తుల్లో కీలుబొమ్మగా మారిన కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ ధరకు అప్పగించాలని చూస్తుందని, ఇటువంటి ప్రయత్నాలను అడ్డుకుని తీరుతామన్నారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగిస్తామని ప్రకటించే వరకు ఉద్యమం ఆగదన్నారు. 1270వ రోజు దీక్షా శిబిరంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మన్మథరావు, జె.అచ్యుతరావు, నాయకులు కొండలరావు, కసిరెడ్డి సత్యనారాయణ, మసేనురావు, జె.రామకృష్ణ, రెహమాన్, రాజబాబు, నరసింగరావు, మంత్రి రవి, మంగరాజు, నాగరాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో పాల్గొన్న జీవీసీఎఫ్ ప్రతినిధులు

సీతంపేట: నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గ్రేటర్ విశాఖపట్నం సిటిజన్స్ ఫోరం(జీవీసీఎఫ్) ప్రతినిధులు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంస్థ అధ్యక్షుడు ఎ.కె.సుబ్బారావు మాట్లాడుతూ విశాఖ ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను గుర్తించామన్నారు. ముఖ్యంగా వాయు, జల, శబ్ద కాలుష్యం నివారణ, పచ్చదనం పునరుద్ధరణ, మడ అడవులతో కూడిన పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ, తీరప్రాంత క్రమబద్ధీకరణ, మురుగునీటి శుద్ధి సామర్థ్యం పెంపు, వర్షపు నీటి నిర్వహణ, ప్లాస్టిక్ కాలుష్య నివారణ, సహజ నీటి వనరుల రక్షణ, పౌరుల భూమి పరిరక్షణ, ట్రాఫిక్ సమస్య, ప్రజా రవాణా మెరుగుదల, వారసత్వ సంపద పరిరక్షణ, మురికివాడల్లో జీవితాన్ని మెరుగుపర్చడం, నగరాభివృద్ధికి తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. ప్రజల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ టి.వి.నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ సోహన్ హటంగడి, సెక్రటరీ ఎస్.విశ్వనాథన్, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జూలో సూచిక బోర్డుల ఏర్పాటు



జూలో వన్యప్రాణులను సూచించే బోర్డు, మ్యాప్ పరిశీలిస్తున్న చిన్నారి

ఆరిలోవ: ఇందిరా గాంధీ జులాజికల్ పార్కులో వన్యప్రాణులను చూసి సంబరపడతారు. జూకు వెళ్లగానే ముందుగా కనిపించిన జంతువులు, పక్షులను చూసి సరదా పడతారు. కొన్నింటిని చూడాలని ముందుగానే అనుకొన్నా.. అవి ఎక్కడ ఉన్నాయో తెలియక నిరాశకు గురవుతుంటారు. ఇప్పుడు ఆ సమస్యకు జూ అధికారులు చెక్ పెట్టారు. ఏయే వన్యప్రాణులు ఎటువైపు ఉన్నాయో **ముందుగానే తెలు**సుకోవచ్చు. ఆ విధంగా జూ అధి**కారులు పలు చోట్ల** సూచిక బోర్డులు, మ్యాప్‌లు **ఏర్పాటు చేశారు.** వాటికి అనుగుణంగా జూకు వెళ్లే **సందర్శకులు వన్య**ప్రాణులను తిలకించవచ్చు. ఈ **బోర్డులు జూ లోపల** ప్రధాన ద్వారం, జీబ్రా ఎన్‌క్లో**జర్, కనుజులు మోటు** ఎదురుగా, జూ కొలను వద్ద **సూచిక బోర్డులు ఏ**ర్పాటు చేశారు. ఎటు వెళ్లే ఏయే **వన్యప్రాణులు ఉ**న్నాయో తెలుసుకోవడానికి ఆ **బోర్డుపై వివరాలు** రాశారు. జూ లోపలకు ప్రధాన **ద్వారం నుంచి ప్రవే**శించే సందర్శకులు ఎడమ వైపు తిరిగితే నల్ల హంసలు, ఖడ్గమృగం, ఏనుగులు, కోతులు జోన్, చింపాంజీలు, చిరుతలు, పెద్ద పులులు(ఎల్లో), తెల్ల పులులు, ఆఫ్రికన్ పక్షులు, సింహాలు, మీర్‌క్యాట్‌లు, ఎలుగుబంట్లు, బయోస్కోప్ వరకు చేరుకోవచ్చు. ప్రధాన ద్వారం వద్ద కుడి వైపు వెళ్తే ఆస్ట్రిచ్, ఈమూ, నిశాచర జీవుల గుహ, జీబ్రా, జిరాఫీలు, నెమళ్ల జోన్, అడవి దున్నలు, కణుజులు, లవ్ బర్డ్స్ జోన్, చుక్కల జింకలు, పాముల జోన్, నీటి ఏనుగులు, సీతకోక చిలుకల పార్కు, బయోస్కోప్ వరకు చేరుకోవచ్చు. సాగర్ ద్వారం నుంచి జూ లోపలకు ప్రవేశించేవారు ఘరియల్(మొసళ్లు), మొసళ్ల జోన్ మీదుగా పాముల ఎన్‌క్లోజర్‌కు చేరుకోవచ్చు. జూలో ఏ ద్వారం నుంచి ప్రవేశించినా మళ్లీ అదే ద్వారం వద్దకు చేరుకోవడానికి సుమారు మూడున్నర కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ దారి మధ్యలో వన్యప్రాణుల ఎన్‌క్లోజర్లు ఉన్నాయి. ఇంత దూరం నడవలేని వారు, సమయం ఎక్కువగా పడుతుంది అనుకొనేవారు ఇక్కడ అందుబాటులో ఉన్న బ్యాటరీ వాహనాలపై ప్రయాణించి జూ అంతా చుట్టి రావచ్చు. వీటితో పాటు ఇక్కడ అందుబాటులో ఉన్న బ్యాటరీ సైకిళ్లపైనా తిరుగుతూ వన్యప్రాణులను తిలకించే అవకాశం ఉంది.

నీటి ఏనుగుల సందడి



జూలో నీటిలో మునుగుతున్న నీటి ఏనుగులు



ఎన్‌క్లోజరులో యానిమల్ కీపర్ వేసిన ఆహారం తింటున్న నీటి ఏనుగులు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో ఆదివారం నీటి ఏనుగులు సందడి చేశాయి. వాటి ఎన్‌క్లోజరులో హుషారుగా తిరుగుతూ జూకి వెళ్లిన సందర్శకులకు కనువిందు చేశాయి. సెలవు రోజు కావడంతో ఎక్కువ మంది జూ పార్కును ఆదివారం సందర్శించారు. ఇటీవల గుజరాత్ నుంచి తీసుకొచ్చిన వివిధ రకాల పక్షులు, మీర్‌క్యాట్‌లు పులులు, చుక్కల జింకలు సందర్శకులను అలరించాయి. ఇక్కడ నీటి ఏనుగులు వాటి ఎన్‌క్లోజర్‌లో నీటిలో మునుగుతూ, తేలుతూ గంటల తరబడి అలరించాయి. యానిమల్ కీపర్ వేసిన ఆహారం తింటూ కొలనులోకి వెళ్లి నీటిలో మునుగుతుండేవి. దీంతో వీటి ఎన్‌క్లోజర్ వద్ద సందర్శకులు ఎక్కువ సేపు గడిపారు.

సంచార జాతుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజు గౌడ్



రాజు గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరిస్తున్న సంఘం సభ్యులు

ఎంవీపీ కాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంచార జాతుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజు గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుల నుంచి ఆదివారం ఉత్తర్వులు అందుకున్నట్లు రాజ్ గౌడ్ తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రాజు గౌడ్‌ను ఆయా కులాల ప్రతినిధులు పెదవాల్తేర్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 32 కులాలు మోస్ట్ బ్యాక్వర్డ్ క్లాసెస్ ఉన్నాయన్నారు. గత కొన్నేళ్లుగా ఉత్తరాంధ్రలోని యాత కులం సామాజిక అభివృద్ధికి పెద్ద ఎత్తున కృషి చేస్తున్నట్లు తెలిపారు. వెనుకబడిన అన్ని కులాల ప్రగతికి కృషి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయుడు, గెద్దాడ రమేష్, బొంతు కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆసియన్ బాక్సింగ్ సెలక్షన్ ట్రయల్స్‌కు దీపిక



క్రీడాకారిణి దీపిక

ఉక్కునగరం: ఆసియన్ బాక్సింగ్ సెలక్షన్ ట్రయల్స్‌కు స్టీల్‌ప్లాంట్ విద్యార్థిని కనక దీపిక ఎంపికయ్యారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 10 వరకు అబుదాబీ లోని ఎ1 ఏతఉఎస్ సిటీలో ఏఎస్‌బీసీ ఆసియన్ జూనియర్ బాలురు, బాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో అర్హత కోసం బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 11 వరకు రోహతక్‌లోని సాయ్‌లో సెలక్షన్ ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. జాతీయ డీఏవీ బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో రాష్ట్రస్థాయిలో బంగారు పతకం, సీబీఎస్ఈ సౌత్ జోన్ పోటీల్లో కాంస్యపతకం సాధించిన కనక దీపికను ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ సెలక్షన్ ట్రయల్స్‌కు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో దీపికను స్టీల్‌ప్లాంట్ బాక్సింగ్ కోచ్ కె. శ్రీనివాసరావు అభినందించారు. దీపిక తండ్రి కె. వెంకటరామారావు స్టీల్‌ప్లాంట్‌లో చార్జిమెన్ కాగా తల్లి భవాని న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు.

ఉత్సాహంగా జాతీయ స్థాయి కరాటే పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న కరణంరెడ్డి

పెదగంట్యాడ: అమరపిని యాన్సెంట్ షాటో కాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీసీ రోడ్డులోని అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన 3వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో 9 రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున క్రీడాకారులు హాజరయ్యారు. ఆంధ్రపదేశ్ నుంచి ఆంధ్ర షాటో కాన్ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా తెలంగాణకు చెందిన డ్రాగన్ షాటో కాన్ కరాటే డూ స్పోర్ట్స్ ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు బహుమతులు అందజేశారు. పోటీలను గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ప్రారంభించారు. అమరపిన్ని నరేంద్ర, అమరపిన్ని మనోహర్ సాయి పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు.

కేరళ బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ

సీతమ్మధార : కేరళలోని వాయనాడ్ వరద బీభత్సంలో సర్వం కోల్పోయిన బాధితుల సహాయార్థం జగదాంబ జోన్ సీపీఎం పార్టీ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించగా రూ. 15,162 వసూలైంది. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు వై.రాజు మాట్లాడుతూ పర్యావరణ సమతౌల్యం దెబ్బ తిన్న కారణంగా ఇటువంటి విపత్తులు సంభవిస్తాయని, కార్పొరేట్ సంస్థల అనాలోచిత చర్యలే దీనికి కారణమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జగదాంబ జోన్ నాయకులు చంద్రమౌళి, డీవైఎఫ్ఐ నాయకుడు గణేష్, భవన నిర్మాణ కార్మిక నాయకులు కె.నర్సింగరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.